
ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025
5
విజయనగరం



విఎంఆర్‌డిఎ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పలు రహదారులు, పార్కుల అభివృద్ధిని విఎంఆర్‌డిఎ ద్వారా చేపట్టడానికి ప్రతిపాదనలు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మంగళవారం తన ఛాంబర్ లో విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ , జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తో చర్చించారు. స్థానిక బస్ కాంప్లెక్స్ జంక్షన్ నుండి ధర్మపురి, అయినాడ వరకు, జె.ఎన్.టి.యు, మెడికల్ కాలేజ్ రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించినట్లు కలెక్టర్ తెలిపారు. రింగ్ రోడ్డు వద్ద పి.ఎస్ ఆర్ పార్కు, అయ్యన్నపేట వద్ద పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆనందగజపతి ఆడిటోరియం ఆధునీకరణ, ఆడిటోరియం వద్ద డిజిటల్ లైబ్రరీ, స్టడీ సెంటర్, కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ శ్రీనివాస మూర్తి, కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో ఆహారం కలుషితం

20మంది విద్యార్థినులకు అస్వస్థత

• ఐసియులో ఐదుగురు విద్యార్థినులు • మెరుగైన వైద్యం అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం కోట, టౌన్

నగరంలోని సాంఘిక సంక్షేమ విద్యార్థినుల హాస్టల్ - 3లో సోమవారం భోజనం చేసిన 20 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వీరిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆహారం కలుషితం కావడమే ఇందుకు కారణమని విద్యార్థినులు అంటున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న ఐదుగురు విద్యార్థినుల్లో ముగ్గురు తిరుమల-మెడికవర్‌లోను, మరో ఇద్దరు జిల్లా కేంద్రాస్పత్రిలోను చికిత్స పొందుతున్నారు. ఈ హాస్టల్‌లో ఇంటర్, డిగ్రీ, నర్సింగ్ విద్యార్థులు ఉంటున్నారు. వీరికి ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌లో చికెన్, బిరియాని పెట్టారు. ఆరోజు రాత్రే ఆరుగురు విద్యార్థులకు విరేచనాలు కావడంతో ఆస్పత్రిలో చేరారు. మిగతా వారంతా ఒక్కొక్కరుగా అస్వస్థతకు గురవ్వంతో ఆస్పత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న రమ్య అనే విద్యార్థిని ఐసియులో చికిత్స పొందుతోంది. జనరల్ వార్డులో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మిగతా వారంతా కోలుకొని హాస్టల్‌కు, తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అస్వస్థతకు గురైన వారిలో అంపోలు అలేఖ (ఇంటర్), బంకపల్లి దీపిక (నర్సింగ్), జస్విని, సింధూ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు ఎస్ఎఫ్ఐ నాయకుల పరామర్శ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి రాము, సిహెచ్ వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకి పరామర్శించారు. ఈసందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి రాను రాను అగమ్య గోచరంగా తయారవుతుందని విమర్శించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, హాస్టల్ వార్డెన్‌ల నిర్లక్ష్యం వల్ల విద్యార్థినులను ప్రాణాపాయ స్థితికి తీసుకొచ్చిందని అన్నారు. వారం రోజులుగా ఎస్ఎఫ్ఐ బృందం, విద్యార్థులు హాస్టల్ వార్డెన్ వద్ద ఎంత మొరపెట్టుకుంటున్న ఫుడ్ మార్చకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. ఇద్దరి పరిస్థితి క్షీణించడంతో జనరల్ వాటి నుంచి ఐసియులోకి మార్చారని తెలిపారు. ఇంతటి పరిస్థితి జరుగుతున్నప్పటికీ హాస్టల్ సంక్షేమ అధికారిని విద్యార్థులను పరామర్శించకపోవడం అన్యాయమని అన్నారు. తక్షణమే డిడి హాస్పిటల్లో ఉన్న విద్యార్థులను పరామర్శించి వారికి మెరుగైన సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంతటి ఘోరానికి కారణమైన వార్డెన్ రాధామణిపై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు



విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బీమా రంగంలో ఎఫ్‌డిఐ పెంపు దుర్మార్గం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74శాతం నుంచి వందశాతానికి పెంచుతున్నట్లు ప్రకటించడాన్ని నిరసిస్తూ ఎల్ఐసి ఉద్యోగులు మంగళవారం ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ నిర్ణయం వల్ల భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన మూలధన సమీకరణపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఇన్సూరెన్సు ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. ఈ నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఖండిస్తోందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.తిరుమలరావు, ఆర్.అప్పల నాయుడు మాట్లాడుతూ 1999లో ఐఆర్‌డిఎ బిల్లు ఆమోదం పొందిన తర్వాత బీమా రంగాన్ని ప్రయివేటీకరించారని, ఆ చట్టం ద్వారా భారతీయ పెట్టుబడిదారులు విదేశీ భాగస్వాములతో కలిసి బీమావ్యాపారం నిర్వహించేందుకు అనుమతి పొందారన్నారు. ఆ సమయంలో ఎఫ్‌డిఐ పరిమితిని 26శాతంగా నిర్ణయించారని, తరువాత దానిని 74శాతానికి పెంచారని తెలిపారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం 100శాతం విదేశీ పెట్టుబడులను అనుమతివ్వడం ఇన్సూరెన్సు రంగాన్ని నాశనం చేసేందుకేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు భారతదేశాన్ని 1956 నాటి పరిస్థితికి తీసుకెళ్తాయని విమర్శించారు. ప్రజల పొదుపులను ప్రమాదంలోకి నెడుతుందన్నారు. కార్మికులు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునే విధంగా ఈ బడ్జెట్ ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన



విజయనగరం ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గరివిడి ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం వద్ద

గరివిడి : బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డిఐలకు అనుమతినిస్తూ కేంద్ర బడ్జెట్‌లో ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ స్థానిక ఎల్ఐసి బ్రాంచి కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఐసిఇయు బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు జి.సిద్ధార్థ, డి.వెంకటేష్ మాట్లాడారు. కేంద్రం వెంటనే ఎఫ్‌డిఐ పెంపును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

వాలీబాల్ రాష్ట్ర విజేత విజయనగరం జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రథసప్తమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలలో జిల్లా జట్టు లీగ్ దశలో అనంతపురం, చిత్తూరు జట్లపై విజయం సాధించి పూల్ విజేత గా నిలిచింది. క్వార్టర్ ఫైనల్స్ లో నెల్లూరు జట్టు పైన, సెమీఫైనల్‌లో కృష్ణా జిల్లా జట్టు పైన విజయం సాధించి ఫైనల్స్ కి చేరుకుంది. ఫైనల్స్ లో శ్రీకాకుళం జట్టు పై 2-1 తేడాతో విజయం సాధించి రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన మన జిల్లా జట్టు రూ.50వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జట్టును అధ్యక్షులు సూరిబాబు, కార్యదర్శి కెవిఎయన్ రాజు, వాలీబాల్ సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.



విజేతగా నిలిచిన విజయనగరం జట్టు



ఫైరింగ్ చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

భద్రతలో అనుక్షణం అప్రమత్తం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ముఖ్య వ్యక్తుల భద్రతలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలోని ఫైరింగు రేంజ్‌లో వివిధ ఆయుధాలను వినియోగిస్తూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పిఎస్‌ఒల ఫైరింగు ప్రాక్టీసును మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పిఎస్‌ఒలకు మూడు రోజులపాటు నిర్వహించిన రిఫ్రెషర్ కోర్సులో ముఖ్యవ్యక్తుల భద్రతకు వారు నిర్వహించే విధులు, చేపట్టాల్సిన చర్యలు, శారీరక దారుఢ్యం మెరుగు పర్చుకొనడంలో శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం ఎస్‌పి ఫైరింగు ప్రాక్టీసులో పాల్గొని, వివిధ ఆయుధాలతో ఫైరింగు ప్రాక్టీసు చేసారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రోడ్డు భద్రత కు ట్రాఫిక్ నిబంధనలు విద్యార్థులు కచ్చితంగా పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రావ్య అన్నారు. మంగళవారం స్థానిక పోర్ట్ సిటీ స్కూల్‌లో విద్యార్థులకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2 వీలర్స్ నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్ నడిపేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలను స్పీడ్‌గా నడపడం ప్రాణాలకే ప్రమాదమని అన్నారు. కారక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదట ప్రాధాన్యత ఓటువేసి గెలిపించండి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్, మండల కమిటీ అధ్యక్షుడు మద్దిల సత్యనారాయణ తదితరులతో కలిసి నెల్లిమర్ల పట్టణంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రజా వ్యతిరేక సంస్కరణలు, విధానాలను ఎదురించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన పీడీఎఫ్ తరపున పోటీ చేస్తున్న తనకు అన్ని సంఘాల ఉపాధ్యాయులు మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సి కమిటీ వేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనులు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై ఆన్‌లైన్ యాప్‌ల భారంతో విద్యాబోధనకు తీవ్రమైన ఆటంకం ఏర్పడుతుందన్నారు. వారిని బోధనకే పరిమితం చేయాలని కోరారు. అందరికీ కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని చెప్పారు. సిపిఎస్, 117 జీఓ రద్దు తదితర సమస్యలను తమ మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు విజయగౌరి పేర్కొన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 9 నుంచి పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిలెంక సన్యాసి నాయుడు, సహాధ్యక్షులు వంగపండు సురేష్ బాబు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కె.విజయగౌరి

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజలంతా కేన్సర్‌పై అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. జీవనరాణి తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవ సందర్భంగా డిఎంఅండ్ హెచ్ఒ కార్యాలయం దగ్గర అవగాహన ర్యాలీని ప్రారంభించి జిల్లా కేంద్ర ఆస్పత్రి గేట్ వరకు ర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు కూడా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల జీవనశైలి మార్చుకోవడం ద్వారా కేన్సర్‌కు దూరంగా ఉండొచ్చన్నారు. లంగ్స్, సర్వైకల్, త్రోట్, బ్రెస్ట్ కేన్సర్ ఇలా అనేక రకాలుగా రావడానికి అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎవరికైనా అనుమానాలు ఉంటే జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఆస్పత్రిఓ సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రథమ దశలో గుర్తిస్తే నివారరించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరెండెంట్ డాక్టర్ పిఎ రమణి, కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. దేవిమాధవి, డాక్టర్ జెడ్ శరత్ బాబు, డాక్టర్ జెఎన్‌వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది



కోలాట ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా బాలోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం బాలోత్సవం ఆనందగజపతి కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులకు కథా రచన , పాటలు పాడటం , పద్యాలు పాడటం, మట్టితో బొమ్మలు చేయడం , ఫోక్ డ్యాన్స్ , ఫాన్సీ డ్రెస్ కాంపిటేషన్ , నాటికలు , ఏక పాత్రాభినయం వంటి పోటీలు నిర్వహించారు. జిఎస్ చలం అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో బాలోత్సవం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసే విధంగా విజయనగర బాలోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోందన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో పుస్తకాలకు బానిసలైన విద్యార్దులు అసలు బయటి ప్రపంచాన్ని మర్చిపోతున్నారని తెలిపారు. అందుకోసమే వారిలో కళలను బయటకి తీసే విధంగా అనేక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న దవళ సర్వేశ్వరరావు, జిఎస్ చలం, వై. శ్రీనివాసరావు , చిన్నా దేవి మాట్లాడుతూ గతేడాదిలాగే ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారని , వారిని ప్రోత్సహిస్తున్న తల్లి తండ్రులకు , వారి పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. విద్యార్థులలో సజనాత్మకతను వెతికి తీసే విధంగా పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు , కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు డప్పు శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంఆర్ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీరు గంటా హరీష్ ఏక్ భారత్-శ్రేష్ఠతా భారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు పంజాబ్ లోని చండీఘర్ విశ్వవిద్యాలయంలో జరగనున్న 7 రోజుల జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికయ్యారని ఎయు ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ నుంచి ఉత్తర్వులు అందాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబ శివరావు తెలిపారు. ఈ సంధర్భంగా జరిగే అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని, జాతీయ సమైక్యతా భావాన్ని విద్యార్థులు పెంపొందించుకోవచ్చని చెప్పారు. ఎంఆర్ కాలేజీలో బిఎస్‌సి (రసాయన శాస్త్రం) ద్వితీయ సంవత్సరం చదువుతున్న హరీష్ మొదటి నుండి ఎన్.ఎస్.ఎస్ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అభినందన సభలో విజయనగరం ఎన్ఎస్ఎస్ డిపిఒ జి. చంద్ర శేఖరరావు తో పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు ఎం.శ్రీకాంత్, డాక్టర్. పి.ఎన్.బి.శర్మ, సిహెచ్ చిన్నం నాయుడు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలి

జనసేన ప్రధాన కార్యదర్శి శిశశంకర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ఎంఇ అభివృద్ధి సంస్థ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. గుంకలాం గ్రామంలో పలువురు గురాన అయ్యలు ఆధ్వర్యంలో వైసిపి నుంచి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన రాజకీయ ప్రస్థానం పదవుల కోసం కాదు ప్రజాసేవ కోసమని అన్నారు. జన సైనికులకు భద్రత, భరోసా జనసేన లక్ష్యమన్నారు. జనసైనికులంతా బలంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గురాన అయ్యలు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి సమిష్టిగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో భోగి సాయి కుమార్, గుంకలాం గ్రామానికి చెందిన లంక అప్పలనాయుడు, గంట్రేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వైసిపి కార్యకర్తలు, నాయకులు

రెగ్యులర్ కార్యకలాపాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయిన వెంటనే రెగ్యులర్ కార్యకలాపాలను నిర్వహించాలని జిల్లా సహకార అధికారి పి. రమేష్ చెప్పారు. పిఎసిఎస్ కంప్యూటరైజేషన్‌లో భాగంగా కంప్యూటరీకరణ అమలుపై ఉమ్మడి విజయనగరం జిల్లాలో 95 సొసైటీలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను ఆప్కాబ్ సిటిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో పది సొసైటీలకు చొప్పున శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శిక్షణా తరగతులనుద్దేశించిన రమేష్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతాంగానికి మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కార్యక్రమంలో డిసిసిబి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు, జిఎం కెవిఎన్ ఆర్ సత్యనారాయణ, డిజీఎం బిఎస్ఎస్ ప్రసాద్, డిపిడిఎం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని ఆశాల నిరసన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆరోగ్య రంగంలో ప్రాథమిక స్థాయిలో వైద్య సేవలు అందించే ఆశావర్కర్లు తీవ్రమైన పనిభారం, ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, వెంకటలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం విజయనగరం అర్బన్, రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పని భారం , ఒత్తిడి తీవ్రంగా పెరుగుతుందని, వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఎన్ఎల్ఇపి, ఎన్‌సిడి సిడి, టిబి, ఎఎన్‌సి వంటి సర్వేలు , ప్రజల కఫాన్ని సేకరించి హాస్పిటల్‌కు పరీక్షల నిమిత్తం తీసుకురావటంతో పాటు మెడికల్ కిట్ లు కూడా అశా కార్యకర్తలే తెస్తున్నారని, వీటికి అయ్యే ఖర్చులు కూడా భరించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్దిష్టమైన పనిగంటలు ఉండాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేయక తప్పదన్నారు. లేబర్ కోడ్లు కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 5న సాయంత్రం 4గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మ, కనక మహాలక్ష్మి, నాగమ్మ, పైడ్రాజు, సునీత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి

జిల్లా సమాఖ్య ద్వారా కషాయాల విక్రయం : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఖరీఫ్ 2025లో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారుతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ప్రకృతి సేద్యం, దాని విస్తరణ, ఆవశ్యకత, ఉపయోగాలు, నూతన ప్రయోగాలు తదితర అంశాలపై చర్చించారు. వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఎపి కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు మాట్లాడుతూ, జిల్లాలో జరుగుతున్న ప్రకతి వ్యవసాయం గురించి వివరించారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సామాన్య రైతులకు మరింత చేరువ చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 27 మండలాల్లో 54 యూనిట్లు ఉన్నాయని, 220 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి సేద్యం జరుగుతోందని చెప్పారు. ఈ గ్రామాల్లోని 9716 మహిళా సంఘాలు భాగస్వామ్యం అవ్వగా, ఈ సంఘాల్లోని మొత్తం 1,12, 151 మంది సభ్యులు ఉన్నప్పటికీ, కేవలం 59,279 మంది మహిళలు మాత్రమే సుమారు 80వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం గానీ, అనుసరించడానికి ముందుకు రావడం గానీ జరిగిందని తెలిపారు. మిగిలిన వారందరూ ప్రకతి వ్యవసాయం చేసేవిధంగా వారిని చైతన్య పరచాలని సూచించారు. ప్రస్తుతం 28 శాతంగా ఉన్న వీరి సంఖ్య కనీసం 40 శాతానికి చేర్చేవిధంగా ఖరీఫ్ నాటికి ప్రణాళికను రూపొందించాలన్నారు. జిల్లా సమాఖ్య ద్వారా అవసరమైన కషాయాలు, రసాలు, పిఎండిఎస్ కిట్లను జిల్లా సమాఖ్య ద్వారా తయారు చేయించి, రైతులకు విక్రయించాలని కలెక్టర్ సూచించారు. మేనెల నాటికి ఈ ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తిని ఆదేశించారు. సమావేశంలో ఉద్యానశాఖ డిడి జమదగ్ని, మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ, డిపిఎం ఆనందరావు, ఎడిఎలు, ఎఒలు, ఎపిఎంలు, హెచ్ఒలు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఇఒలు

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒలు ఎస్.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనం వైపు పిల్లలు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బక్కు నాయుడుపేట వద్ద ఉన్న బాలికల వసతి గృహాన్ని సందర్శించి పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్, పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్, సెల్ఫ్ బెస్ట్, డైలీ స్టడీ అవర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ పరిశీలనలో వసతి గృహం ప్రిన్సిపల్ కిరణ్మయి, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఒ 117 అమలుపై సమావేశం

వేపాడ: మండల కేంద్రంలోని ఎంఆర్‌సి భవనంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు జిఒ 117 అమలుపై ఎంఇఒలు ఎస్. నాగభూషణరావు, పి బాల భాస్కర రావు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంఇఒలు మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి అధిక సంఖ్యలో విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, వర్క్ బుక్స్, లైన్ టు లైన్ రెడ్ పెన్నుతో కరెక్షన్ చేయాలని, ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్, పర్సనల్ మార్కు రిజిస్టర్, ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ఉపాధ్యాయుల మూమెంట్ రిజిస్టర్‌ను అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశించారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

గిరిజన గ్రామాలకు తాగునీరివ్వండి

మెంటాడ: మండలంలో ఆంద్ర, కూనేరు పంచాయతీల మధుర గిరిజన గ్రామాలకు మంచినీటి సౌకర్యం, రహదారి సదుపాయం కల్పించాలని పోస్టర్ ద్వారా గిరిజనులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, కూటమి ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి కొనసాగుతున్నారని అయినప్పటికీ గిరిజన గ్రామాలకు తాగునీరు రహదారి సౌకర్యం కల్పించకపోవడంలో విఫలమయ్యారని ఆయన అన్నారు. పలుమార్లు జిల్లా అధికారులు, మండల పరిధిలో సంబంధిత శాఖల అధికారులకు తమ గోడును వినిపించినా పట్టించుకునే దాఖలాలు కానరావడం లేదని మండిపడ్డారు. గిరిజనులకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించి వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

మామిడి తోటకు పత్రామృతం పిచికారి

బొబ్బిలి: మున్సిపాలిటీలోని మల్లమ్మపేటకు చెందిన రైతు కె.అన్నంనాయుడు మామిడి తోటకు పత్రామృతం పిచికారీ చేశారు. పూత నిలబడేందుకు బొప్పాయి, తులసి, జామ, కాను, వేప, మారేడు, జిల్లేడు, వెదురు, మునగ, ఉమ్మెత్త ఆకులను రెండేసి కిలోలను తీసుకుని దంచి ఒక డ్రమ్ములో 180 లీటర్ల నీటిలో దంచిన పది రకాల ఆకుల కలబంటను, వాటిని పువ్వులు, పది లీటర్ల గోమూత్రంతో పత్రామృతం తయారు చేసినట్లు సేంద్రీయ వ్యవసాయ అధికారి శంకరరావు చెప్పారు. ఐదు రోజుల తర్వాత ఒక ట్యాంకుకు రెండు లీటర్లు వేసుకొని స్ప్రే చేసినట్లు చెప్పారు. దీని వల్ల మొక్కల పువ్వు, పింజ నిలబడి దిగుబడి వస్తుందని చెప్పారు.

రామతీర్థంలో ఘనంగా రథసప్తమి వేడుకలు

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా చేపట్టారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఎమ్మెల్యేకి వేదాశీర్వచనాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రథసప్తమి పర్వదినాన్ని ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు.

ఎంఇఒ-2గా ఖండాపు జగదీశ్వరి

వంగర: మండల విద్యాశాఖ అధికారి-2గా ఖండాపు జగదీశ్వరి మంగళవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంఇఒ-2గా పనిచేసిన వై. దుర్గారావు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆమె ఎంఇఒ-2గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌సి సిబ్బంది ఆమెను సత్కరించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంచేందుకు కృషి

విజయనగరంకోట: విద్యార్థుల్లో సృజనా శక్తిని పెంపొందించడానికి లీడ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మంగళవారం లీడ్ ఇండియా సంస్థ బృందం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. పిల్లల్లో లీడర్ షిప్ లక్షణాలు, విలువలు, నైపుణ్యం, ఆలోచనా శక్తిని పెంపొందించడం తదితర అంశాలపై అవగాహన కలిగించడానికి లీడ్ ఇండియా ద్వారా కృషి చేస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ శిక్షణలు పిల్లలకు ఏ విధంగా పనిచేస్తాయో పరిశీలించి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డిఇఒ మాణిక్యం నాయుడుకు సూచించారు. సమావేశంలో లీడ్ ఇండియా ప్రతినిధులు బాలాజీ, ఉమ, తమ్మన్న శెట్టి, ఇందిరా మణి, అరుణ కుమారి, విజయలక్ష్మి, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఎఇగా అనంతరావు

వంగర: గృహ నిర్మాణ శాఖ ఎఇగా కొప్పర అనంతరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎఇ పైడితల్లి బదిలీపై బాడంగి మండలం వెళ్లడంతో వంగర మండలం రాజులు గుమ్మడ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేసిన అనంత రావుకు గృహ నిర్మాణ శాఖ ఎఇగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించడంతో ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

చెరకు లోడు ట్రాక్టర్ బోల్తా

వంగర: మండలంలోని మగ్గూరు సమీపంలో చెరకలోడుతో వెళుతున్న ట్రాక్టర్ మంగళవారం బోల్తా పడింది. వంగర నుంచి రేగిడి మండలం సంకిలిలో గల షుగర్ ఫ్యాక్టరీకి అధిక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియమితులైన గోనుగుంట్ల కోటేశ్వరరావును జిల్లా గ్రంథాలయ సేవాసంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్ గుంటూరులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకు-ావాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా జిల్లాలో 40 శాఖా గ్రంథాలయాలు, 70 వరకు పుస్తక పంపిణి కేంద్రాలున్నాయని, కానీ గ్రంథాలయాధికారులు మాత్రం కొన్ని చోట్ల మాత్రమే వున్నారని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన వారు ఎక్కువ మంది ఉండడం వల్ల రెండు మూడు గ్రంథాలయాలను ఒక్కరే చూడాల్సి వస్తోందని తెలిపారు. జిల్లాలో 14 శాఖా గ్రంథాలయాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని, మిగిలినవి కొన్ని అద్దె భవనాల్లోనూ, కొన్ని దాతల సహకారంతో కొనసాగుతున్నాయని అన్నారు. అన్ని విద్యాసంస్థల్లోనూ గ్రంథాలయ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని కోరారు. గ్రంథాలయాలకు పుస్తకాల కొరత లేకుండా చూడాలని చైర్మన్ ను కోరారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి- కొత్తవలస

గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో విర్చో ఫౌండేషన్ సహకారంతో వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. విర్చో జిఎం టి. ప్రవీణ, మల్లారెడ్డి చేతులు మీదుగా సుమారు 200 మందికి పైగా కృత్రిమ కాళ్ళు, చేతులు, కాలిపర్స్, చెవిటి మెషిన్లు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, హ్యాండ్ క్రచెస్, వాకర్స్, హ్యాండ్ స్టిక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, ట్రస్ట్ బృందం పాల్గొన్నారు.

అవకతవకలు బయటపడేనా?

● ఇళ్ల స్థలాల పంపిణీలో దోపిడీ ● వైసిపి నాయకులు, రెవెన్యూ సిబ్బంది బంధువులకు స్థలాలు ● లబ్ధిదారుల వివరాలు ఇచ్చేందుకు వెనకాడుతున్న రెవెన్యూశాఖ ● ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి పంపిణీ చేసిన జగనన్న ఇళ్ల స్థలాలు విషయంలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. పట్టణంలోని సర్వే నంబర్ 147లో భారీ అవకతవకలు జరిగాయని ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు గతంలో ఆందోళనలు, ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల స్థలాలకు భూసేకరణ, ఇళ్ల స్థలాల పంపిణీ ముసుగులో అప్పటి తహాశీల్దార్‌గా పని చేసిన రామారావు ఇష్టాను సారంగా ఆయనకు నచ్చిన వారికి, అనర్హులకు పొజిషన్ సర్టిఫికెట్లను జారీ చేశారు. ఒకే కుటుంబంలో ఉన్న ముగ్గురు, నలుగురికి మండలంలోని వేరువేరు చోట్ల ఇళ్ల స్థలాలను కేటాయించారు. మండలంలోని ప్రభుత్వ ఇళ్ల స్థలాల పంపిణీలో నిబంధనలు పాటించలేదని నచ్చిన వారికి నచ్చిన విధంగా స్థలాలను కేటాయించారని భూముల గోల్మాల్ విషయంలో అప్పట్లో పెద్ద దుమారం రేగినప్పటికీ వైసిపి ప్రభుత్వం అండతో ఎన్ని ఫిర్యాదులు చేసిన స్పందించిన దాఖలాలు లేవు.



సర్వే నెంబర్ 147లో లబ్ధిదారులు నిర్మించిన ఇళ్లు

70 శాతం అనర్హులే

పట్టణంలోని సర్వే నంబర్ 147 జగనన్న కాలనీలో 70 శాతం ఇళ్ల పట్టాలు అనర్హులకే ఇచ్చారని అర్హులను గుర్తించి అనర్హుల పట్టాలను రద్దు చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వబ్బిన సత్యనారాయణ, వబ్బిన సన్యాసినాయుడు ఆ పార్టీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో ధర్నాలు నిర్వహించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వారు కూడా మాట్లాడకపోవడం గమనార్హం.

ఆర్‌డిఒకు ఫిర్యాదు

147 సర్వే నంబర్ సుమారు 1150 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయగా అందులో అధిక శాతం వైసిపి నాయకులకు, రెవెన్యూలో పనిచేస్తున్న వారికి రికమండేషన్లపై బాగా ఆస్తిపాస్తులు ఉన్నవారికి కేటాయించినట్లుగా గతం నుంచి ఆరోపణలు ఉన్నాయి. జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ అవకతవకలు జరిగాయని లబ్ధిదారుల వివరాలతో సహా సమాచారం ఇవ్వాలని ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా ఫిర్యాదు చేయగా 147 సర్వే నెంబర్‌ల గల జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల పంపిణీ లబ్ధిదారుల వివరాలు ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేయడం మరిన్ని అనుమానాలకు దారితీస్తుంది. 147 సర్వేనెంబర్ లేఅవుట్ ఇళ్ల స్థలాల కంపెనీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశాను.

హనుమాన్ శెట్టి సన్యాసయ్య శెట్టి, సామాజిక కార్యకర్త

ఫిర్యాదులు వస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

147 సర్వేనెంబర్ లేఔట్ ఇళ్ల స్థలాల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు వస్తే విచారణ జరి చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ సూచనలతో అప్పటి ఎమ్మార్వో ఏ విధంగా స్థలాలను కేటాయించారో పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తాం. జిల్లా అధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటాం.



ఎం. అరుణకుమారి తహాశీల్దార్ ఎస్‌కోట.

ఫుడ్ పార్క్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-చీపురుపల్లి

చెమటోడ్చి కష్టపడుతున్న తమ కష్టాన్ని గోడౌన్ నిర్వాహకులు నిలువునా దోచుకుంటున్నారని మండలంలోని పత్తికాయవలస వద్ద గల ఫుడ్‌పార్క్ గోడౌన్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి తమకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా మంగళవారం గోడౌన్ ముందు నిరసన తెలుపుతూ లారీలను నిలిపివేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 2018లో గోదాం ప్రారంభించిన నాటి నుంచి ఫుడ్‌పార్క్ పరిసరాలలోని పత్తికాయవలస, పత్తికాయపాలవలస, బెవరపేట, లింగాలవలస గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు ఇదే గోడౌన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రజా పంపిణీకి అవసరమైన బియ్యాన్ని లారీల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం వంటి పనులను నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక లారీ లోడింగ్ అన్‌లోడింగ్‌కు రూ. 9,500 చెల్లించాల్సి ఉన్నప్పటికీ రూ.5వేలు మాత్రమే ఇస్తున్నారని కెఎల్‌పురం, గజపతినగరం, కాపుసంభాం, రాజాం ప్రాంతాలలో గల ఫుట్ కార్పొరేషన్ గోడౌన్లలో ఒక లారీ లోడు లోడింగ్, అన్‌లోడింగ్‌కు రూ.6,500 చెల్లిస్తున్నారని ఇక్కడ మాత్రం రూ.5వేలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ప్రాంతాల మాదిరికే తమకు కూడా రూ.6,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న తమని విధుల నుంచి తప్పించి ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులను రప్పిస్తే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గోడౌన్ యాజమాన్యం రామరాజు అందుబాటులో లేకపోయి నప్పటికీ ఇంఛార్జిగా అక్కడ విధులు నిర్వహిస్తున్న రాముకు తమ సమస్యలు విన్నవించుకున్నప్పటికీ కనీసం పట్టించుకోలేదన్నారు యాజమాన్యం మొండి వైఖరి కారణంగా సుమారు 150 కుటుంబాలు జీవనాధారం లేక రోడ్డున పడే ప్రమాదం ఉందని పాలకులు అధికారులు తమ సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చేయాలని కోరారు. ఈ విషయంపై గోడౌన్ ఇంఛార్జి రామును వివరణ కోరగా గోడౌన్‌లో కార్మికులకు సంబంధించి రెండు నెలల క్రితం కాంట్రాక్ట్ ఒప్పందం కుదిరిందని, ఒప్పందం మేరకే డబ్బులు చెల్లిస్తున్నామని చెప్పారు.



లారీలను నిలుపుదల చేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

బడ్జెట్‌లో ఆదివాసీల సంక్షేమంపై వివక్ష

డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర బడ్జెట్‌లో దళితులు, ఆదివాసీల సంక్షేమంపై వివక్ష చూపారని డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అన్నారు. మంగళవారం దళిత బహుజన శ్రామిక యూనియన్, నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ దళిత ఆదివాసీల కేటాయింపులు అనే అంశంపై నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్ రూ.54,96,936 కోట్లు కాగా, అందులో వివిధ సంక్షేమ పథకాలుకు రూ.15,75,988 కోట్లు కేటాయించారని, నీతి అయోగ్ ఆదేశాల ప్రకారం ఎస్‌సిలకు జనాభా నిష్పత్తి ప్రకారం రూ.2,30,132 కోట్లు కేటాయించాల్సి ఉండగా 1,68,478 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఈ కేటాయించిన బడ్జెట్లో రూ.62,150 కోట్లు మాత్రమే నేరుగా ఉపయోగపడే పథకాలకిచ్చి మిగతా నిధులు సాధారణ పథకాలకు దారి మళ్ళించడం వలన వికసిత భారత్‌లో దళిత ఆదివాసి సంక్షేమం ప్రశ్నార్ధకమే అని అన్నారు. ఎస్‌టిలకు కేటాయించిన రూ.129250 కోట్లు కోట్లలో రూ.51,492కోట్లు మాత్రమే నేరుగా ఎస్‌టిలకు ఉపయోగపడే పథకాలకిచ్చి మిగతా నిధులన్నీ సాధారణ పథకాలకు కేటాయించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీల అత్యాచారాల నిరోధక చట్టం అమలుకు గత ఏడాది కంటే నిధులు తగ్గించి రూ.463 కోట్లు కేటాయించారని తెలిపారు. ముఖ్యంగా బీహార్ కు బడ్జెట్‌లో బోనంజా ఇచ్చి, ఆంధ్రులకు మొండి చేయి చూపించారని చిట్టిబాబు విమర్శించారు. విభజన హామీలను అమలు కోసం నిర్దిష్టమైన చర్యలు ఈ బడ్జెట్ లో లేవన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కనిపించకపోవడం బాధాకరమన్నారు. బడ్జెట్ అంచనాలను సవరించి పేదలకు దళిత ఆదివాసీలకు ఆర్థిక అభివృద్ధికి సహాయపడే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డొమెస్టిక్ వర్కర్స్ కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి , డిబిఎస్‌యు. నాయకులు వంగలపూడి కార్తీక్, బెల్లాన రమ్య తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను ప్రదర్శిస్తున్న చిట్టిబాబు, తదితరులు



అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

పార్కింగ్ స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కేర్ అండ్ క్యూర్ హాస్పిటల్ వద్ద సిఐటియు అనుబంధంగా శ్రీ పైడిమాంబ ఆటో ఆటో స్టాండ్‌ను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ. జగన్మోహన్‌రావు, బి.రమణ , ఆటో యూనియన్ జిల్లా నాయకులు రామనాయుడు ప్రారంభించారు. స్థానిక ఆటో డ్రైవర్ కొయ్యన రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లా డుతూ ఆటో, క్యాబ్, వ్యాన్, లారీ తదితర రవాణా రంగ కార్మికుల సమస్యలపై సిఐటియు దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తుందన్నారు. సిఐటియు అనుబంధంగా స్టాండ్‌ను ఏర్పాటు చేసుకున్నందుకు డ్రైవర్లను అభినందించారు. సరుకు, ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్లు తీవ్ర అవమానాలకు, వేధింపులకు, దాడులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ శిక్షిస్తు న్నారని, పరోక్షంగా డ్రైవర్లపై దాడులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ విధా నాలు ఉన్నాయన్నారు. ఉబర్ ,ఓలా,రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలకు పార్కింగ్ స్థలాలు కేటాయించి ఆహ్వానిస్తున్న ప్రభుత్వాలు స్థానిక ఆటోలకు ఎందుకు పార్కింగ్ స్థలాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. డ్రైవర్ల అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'చిన్నారికి చిరు సాయం'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతున్న 45 రోజుల చిన్నారికి జిల్లా ఆర్యవైశ్య చారిటీ గ్రూప్ వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం చేశారు. స్థానిక రౌతు వీధికి చెందిన తెలుగంటి గోవిందరావుకు 45రోజులు క్రితం కుమారుడు జన్మించాడు. పుట్టుకనుండి ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతున్న కారణంగా సర్జరీ చేయవలసి వచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన గోవిందరావు చారిటీ గ్రూప్ ను సంప్రదించారు. మంగళవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద అబ్బాయి కుటుంబ సభ్యులకు రూ.52 వేలు అందజేశారు. గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు విజ్జపు విజయ్ కుమార్, కార్యదర్శి కె.వెంకటస్వామి పాల్గొన్నారు.

వీధి కుక్కలు పట్టివేత

విజయనగరం టౌన్ : నగరంలో వివిధ ప్రాంతాలలో వీధి కుక్కలను అదుపులోకి తీసుకొని సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య వెల్లడించారు. విడతల వారీగా నగర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, యాంటీరాబిస్ వ్యాక్సినేషన్లను వేయిస్తున్నామన్నారు. మంగళవారం ప్రశాంతినగర్ లోని 7వనెంబర్ సచివాలయ పరిధిలో 28 వీధి కుక్కలను అదుపులోకి తీసుకున్నారు. స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ హరియాణ ఏజెన్సీ ద్వారా సంతాన నిరోధక శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కుక్కలను స్థానిక కొత్తపేట కుమ్మరి వీధి దగ్గర ఉన్న డాగ్ షెడ్‌లో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. ఏ ప్రాంతం నుంచి కుక్కలను తెచ్చారో, శస్త్ర చికిత్సలు అనంతరం ఆయా ప్రాంతాలకే వాటిని విడిచి పెడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రావాడ రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథం మంగళవారం పరిశీలించారు. సర్వేనెంబర్ 64 /1లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వివరాలను తహశీల్దార్ ఎం.సురేష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరు సూర్య భగవాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వ భూమిలో విఎంఆర్‌డిఎకు సంబంధించిన భవనాన్ని నిర్మిస్తారని చర్చ జరుగుతుంది.

వైభవంగా తీర్థ మహోత్సవం

వేపాడ: మండలంలోని జాకేరులో మంగళవారం చిన్నమ్మలు, వీరాంజనేయ తీర్థ మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నాలుగు గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామ పురవీధులలో ఊరేగింపుగా ఆలయానికి తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్ళు, మహిళా కోలాటం గ్రామ పరిధిలో సందడి కనిపించింది. విజేతలకు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, టిడిపి నాయకుడు బుద్ధ అప్పలనాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా నగదు బహుమతులు అందించారు. బుధవారం జిల్లా స్థాయి గుర్రపు పరుగు ప్రదర్శన, సంగిడి రాళ్ల పోటీలు నిర్వహిస్తామని పరిసర గ్రామాల ప్రజలు పాల్గొవాలని సర్పంచ్ కోరారు.

మినీ గోకుల షెడ్‌ను పరిశీలించిన పీడీ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని జగ్గరాజుపేట గ్రామంలో నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను డ్వామా పీడీ ఎస్.శారదాదేవి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎటి అగ్రహారంలో చేసిన పారంపాండ్ పనిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో జూన్ నాటికి 25 ఫారం పాండ్స్, 1 ఫిష్ పాండ్, 20 ఎకరాల్లో బౌండరీ ట్రెంచర్స్, రింగ్ ట్రెంచర్స్, గ్రామానికి కనీసం రెండు పశువుల షెడ్ల పనులు ఖచ్చితంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ, ఇసి, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



పనులున పరిశీలిస్తున్న పీడీ శారదాదేవి

అందరికీ కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి- కొత్తవలస

అనుమానం ఉన్న అందరికీ కేన్సర్ పరీక్షలు చేస్తామని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం అవగాహన ర్యాలీ చేపట్టారు. సర్పంచ్ పులిబంటి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని ఉద్దేశించి వైద్యులు మాట్లాడుతూ కేన్సర్‌పై అవగాహన పెంచుకుని ఆరోగ్య కరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆహారపు అలవాట్లు, జంక్‌ఫుడ్స్ తినకుండా ఉండడం, ప్లాస్టిక్ వాడకం తగ్గడం, పొగాకు ఉత్పత్తులు తగ్గించడం ద్వారా కేన్సర్‌ను నివారించవచ్చునని అన్నారు. ముందస్తు పరీక్షలు చేసి కేన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, పిహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, ఫార్మసిస్ట్ ఆశ జ్యోతి, యుడిసి సురేష్, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎల్‌టి సంతోష్, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

బొబ్బిలి: కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సిహెచ్‌సి సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు కోరారు. ఆసుపత్రిలో మంగళవారం కేన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో ఏ అవయవానికైన కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. రోడ్డు పక్కన షాపులు, హోటల్స్, రెస్టారెంట్లలో భోజనాలు, తినుబండారాలు తినడం వల్ల కేన్సర్ వచ్చే అవకాశం ఉందని, బయట ఫుడ్ తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.



కొత్తవలస: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వేపాడ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ దాట్ల కీర్తి మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో డిప్యూటీ తహశీల్దార్ డి.సన్యాసినాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

గంట్యాడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని మంగళవారం ఆర్‌డిఒ దాట్ల కీర్తి పరిశీలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయడంతో పరిశీలించినట్లు ఆమె తెలిపారు. పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు, టాయిలెట్లు తదితర మౌళిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఆమె వెంట తహశీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, బిఎల్‌ఒలు, పాఠశాల హెచ్‌ఎం తదితరులు ఉన్నారు.

కొత్తవలస: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ కేంద్రాన్ని ఆర్‌డిఒ కీర్తి మంగళవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్తు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి. నీకంఠారావు, హై స్కూల్ హెచ్‌ఎం గోవింద నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కీర్తి

పైడితల్లమ్మను దర్శించుకున్న బొత్స

ప్రజాశక్తి- గజపతినగరం

స్థానిక దిగువ వీధిలో ఉన్న పైడితల్లమ్మను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మంగళవారం దర్శించుకున్నారు. గర్భగుడిలోకి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు బొత్స అప్పల నరసయ్యకు ఆలయ ధర్మకర్త కందుల వెంకట చిన్నయ్యస్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పైడితల్లమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు రెండో రోజుకు చేరుకోవడంతో భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జెడ్‌పిటిసి గార తవుడు, వైస్ ఎంపిపి కర్రి శ్రీదేవి, సర్పంచ్ బెల్లాన త్రినాధరావు, ఉప సర్పంచ్ కర్రి రామునాయుడు, ఎంపిటిసి కర్రి కళావతి, మాజీ ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైసిపి నాయకులు కర్రీ నానాజీ, తుమ్మలగుంటి బుజ్జి, తదితరులు ఉన్నారు.

అన్ని రకాల బ్రాండ్లూ అమ్మాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

వైన్ షాపులలో అన్ని రకాల బ్రాండ్ల మద్యాన్ని అమ్మాలని వ్యాపారులకు ఎక్సైజ్ సిఐ పి.చిన్నం నాయుడు ఆదేశించారు. వైన్ షాపులు నుంచి బార్లకు మంచి బ్రాండ్లు మద్యాన్ని తరలిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో బార్, వైన్ షాపులను మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైన్ షాపులు నుంచి బార్లకు మద్యం వెళ్లడం లేదని గుర్తించినట్లు సిఐ చెప్పారు. వైన్ షాపులలో అన్ని రకాల బ్రాండ్లు మద్యం అమ్మాలని లేనిచో షాపులను సీజ్ చేస్తామన్నారు. ఎంఆర్‌పి ధరలను పెంచి అమ్మితే కేసులు నమోదు చేస్తామని వైన్, బార్ షాపు యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్రాండ్‌లను పరిశీలిస్తున్న సిఐ

మహేశ్వరికి జాతీయ గ్రీన్ స్కూల్ అవార్డు

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయి గ్రీన్ స్కూల్ అవార్డు దక్కింది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్, ఢిల్లీ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌కు దేశ వ్యాప్తంగా కేవలం ఐదు శాతం స్కూలు మాత్రమే పర్యావరణ హిత కార్యక్రమాల ద్వారా ఈ అవార్డ్‌కు ఎంపికయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ డైరెక్టర్ జనరల్ సునీత నరైన్ చేతుల మీదుగా రేగిడి జీవశాస్త్ర ఉపాధ్యాయిని, గ్రీన్ టీచర్ బూరవిల్లి ఉమామహేశ్వరి అవార్డును అందుకున్నారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలిని ఎపి ఎన్‌జిఒ డైరెక్టర్ పి.స్రవంతి, ఎన్‌టిసి రాష్ట్ర కో-ఆర్డినేటర్ పి. నీలకంఠయ్య, జిల్లా విద్యా శాఖాధికారి మాణిక్యంనాయుడు, ఉప విద్యా శాఖాధికారి మోహనరావు, కె.వి రమణ, జిల్లా ఎన్‌టిసి కో-ఆర్డినేటర్ బూరి వేణుగోపాలరావు, ఎంఇఒలు ఎం.వర ప్రసాద్ రావు, కనకయ్య, ప్రధానోపాధ్యాయులు వావిలపల్లి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.